ఆటోవాలా.. బతుకు డీలా





స్త్రీ శక్తి పథకం వల్ల నష్టపోయామంటూ ర్యాలీ చేస్తున్న ఆటో డ్రైవర్లు, యూనియన్ నాయకులు

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్ల ఆదాయానికి గండి
- జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడ్డామని ఆవేదన
- కుటుంబ పోషణ, ఈఎంఐల చెల్లింపులకు అప్పులు చేయాల్సిన దుస్థితి
- నెలనెలా జీవనభృతి చెల్లించి ఆదుకోవాలని డ్రైవర్ల విజ్ఞప్తి



నరసింహనగర్‌లో స్టాండ్‌కే పరిమితమైన ఆటోల వద్ద దిగాలుగా డ్రైవర్లు

సీతంపేట: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం.. ఆటో డ్రైవర్ల పాలిట శాపంలా మారింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడంతో ఆటో కార్మికులు ఆదాయం కోల్పోయి రోడ్డున పడ్డారు. ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల నుంచి అధిక వడ్డీలకు అప్పులు తీసుకుని ఆటో, క్యాబ్, మాక్సీ, జీపులు కొనుగోలు చేసి ప్రజలకు రవాణా సేవలందిస్తూ ప్రభుత్వానికి కోట్ల రూపాయలు పన్నులు చెల్లిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో వారి బతుకు దుర్భరంగా మారింది. బేరాలు లేక ఆటో స్టాండ్‌లో దిగాలుగా ప్రయాణికుల కోసం ఎదురు చూస్తున్నారు. నెల అయ్యేసరికి బండి ఫైనాన్స్ ఈఎంఐ, ఇంటి అద్దె, పిల్లల చదువు ఫీజులు ఎలా కట్టేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బేరాలు లేవు.. బండి కదలదు

ఉత్తర నియోజకవర్గంలో సుమారు 6 వేల మంది ఆటో, క్యాబ్, మ్యాక్సీ డ్రైవర్లు ఉన్నారు. ప్రస్తుతం వారి బతుకు అగమ్యగోచరంగా మారింది. బేరాలు లేక ఉసూరుమంటున్నారు. స్టాండ్ నుంచి బండి కదలడం లేదని, టికెట్ సర్వీస్ కూడా దొరకడం లేదని వాపోతున్నారు. బస్టాప్‌ల వద్ద నిలుచున్న మహిళలను ఆటో ఎక్కమని అడిగితే ఆధార్ కార్డులు చూపిస్తున్నారని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు.. మరోపక్క ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి సర్వీసులతో 40 శాతం ఉపాధిని కోల్పోయామని, ఇపుడు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకంతో మరో 30 శాతం ఆదాయం కోల్పోయి రోడ్డున పడ్డామని డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంధన ధరలు, నిత్యావసర సరకుల ధరలు, వాహన విడి భాగాల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. దీనికి తోడు పెంచిన జరిమానాలు ఆటో డ్రైవర్‌కు కునుకు లేకుండా చేస్తున్నాయని మండిపడుతున్నారు.

ఎన్నికల హామీ నెరవేర్చాలని డిమాండ్

ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందిస్తామని చంద్రబాబు ప్రకటించిన ఎన్నికల హామీని తక్షణం అమలు చేయాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. దీని కోసం 13 నెలలుగా ఎదురు చూస్తున్న తమకు ఎటువంటి షరతులు, బ్యాడ్జి నిబంధన లేకుండా ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నారు. రోడ్ టాక్స్, టోల్ గేట్ ఫీజులు, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, గ్రీన్ టాక్స్, లేబర్ టాక్స్ పేరిట డబ్బులు కట్టలేక అవస్థలు పడుతున్న తరుణంలో ఉచిత బస్సు ప్రయాణం పథకం మరింత కష్టాల్లోకి నెట్టేసిందని వాపోతున్నారు. ఆటోడ్రైవర్ల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలంటూ ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆటో డ్రైవర్ల ఉపాధికి భరోసా కల్పించేలా ప్రతి నెలా కనీసం రూ.5 వేలు జీవనభృతి ప్రభుత్వం చెల్లించి ఆదుకోవాలని, డ్రైవర్ల కోసం పీఎఫ్, ఈఎస్‌ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



జీవనోపాధి కల్పించాలని ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

షరతులు లేకుండా వాహనమిత్ర చెల్లించాలి



కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటో డ్రైవర్లు జీవనోపాధి కోల్పోయారు. ప్రతి ఒక్క డ్రైవర్‌కు నెలకు రూ.5 వేలు జీవనభృతి అందజేయాలి. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఏటా రూ.15 వేలు వాహనమిత్ర పథకం కింద షరతులు లేకుండా అందించాలి. అధిక జరిమానాలకు కారణమవుతున్న 21, 31 జీవోలను, ప్రైవేటు సంస్థలకు అనుమతిచ్చిన వాహన ఫిట్నెస్ పరీక్షలను రద్దు చేసి ప్రభుత్వ పరిధిలో నిర్వహించాలి. పీఎఫ్, ఈఎస్‌ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి.

– జి.వామనమూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్

డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలి



ప్రైవేటు ఫైనాన్స్‌తో ఆటో కొని నడుపుతూ ఇంటి అద్దె, పిల్లల చదువులు, కుటంబ పోషణ చేస్తున్నాను. స్త్రీ శక్తి పథకంతో మా బతుకులు రోడ్డున పడ్డాయి. బేరాలు లేక ఆదాయం కోల్పోయాం. బండి ఈఎంఐ ఎలా కట్టాలో తెలియడం లేదు. జీవనభృతి చెల్లించి ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి.

– యు.శివాజీ, ఆటో డ్రైవర్, అక్కయ్యపాలెం

అప్పు చేసి ఈఎంఐలు కడుతున్నాం



పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాక డ్రైవర్లు చాలా నష్టపోయారు. దానికి తోడు ఉబర్, ఓలా, ర్యాపిడో సర్వీస్‌లతో బేరాలు పోయాయి. ఇపుడు ఫ్రీ బస్సుతో బేరాలు లేక ఉసూరుమంటున్నాం. మరోపక్క జరిమానాలు, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, రోడ్ టాక్స్, గ్రీన్ టాక్స్ పెంచేశారు. అరకొర ఆదాయంతో ఇల్లు గడవడం కష్టంగా మారింది. ఈఎంఐల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– జి.వాసు, ఆటో డ్రైవర్, నరసింహనగర్

గర్భగుడి గోపురం నిర్మాణానికి శంకుస్థాపన



పూజ చేస్తున్న స్వామీజీ సాయిరామ్, ఆలయ అధ్యక్షుడు వాసుదేవరావు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు తిక్కవానిపాలెంలో 93 ఏళ్ల చరిత్ర గల వేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా శుక్రవారం గర్భగుడి గోపురం పనులకు శంకుస్థాపన చేశారు. సద్గురు సేవ ఆశ్రమం స్వామీజీ సాయిరామ్ చేతుల మీదుగా గోపురం నిర్మాణానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి పూర్తి సహకారాలు అందిస్తామని స్వామీజీ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, కమిటీ సభ్యులు పట్టిమి రాజు, బోడిపిల్లి వెంకటరమణ, ఉమ్మిడి అప్పారావు, చెల్లూరి తులసీరావు, గరికిన సూరిబాబు, కొవిరి వెంకటరమణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

క్లుప్తంగా

మహిళా సాధికారత కోసమే ‘మిషన్ శక్తి’



అవగాహన కల్పిస్తున్న సీడీపీవో నీలిమ

మద్దిపాలెం: మహిళా సాధికారత పెంపొందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మిషన్ శక్తి పథకాన్ని ప్రారంభించిందని అర్బన్ సీడీపీవో నీలిమ తెలిపారు. ఆర్ అండ్ బీ జంక్షన్ సమీపంలోని ఓ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంకల్ప్‌లో భాగంగా ఈ నెల 2 నుంచి 12 వరకు 10 రోజుల పాటు ప్రత్యేక అవగాహన ప్రచార కార్యక్రమం నిర్వహించామన్నారు. మహిళల భద్రతకు చేసిన చట్టాలపై అవగాహన పెంచుకుని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బేటీ బచావ్ – బేటీ పడావ్, మహిళల భద్రత, చట్టపరమైన అవగాహన, ఉన్నత విద్య, వృత్తి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, మహిళలు – కౌమార బాలికల ఆరోగ్యం, పోషకాహారం, సమాజంలో జరిగే నేరాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి అనూష, సెక్టార్ సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కన్స్యూమర్ రైట్స్ కమిషన్ కమిటీల రద్దు

సీతంపేట: నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్‌లోని అన్ని కమిటీలను శుక్రవారం నుంచి రద్దు చేస్తున్నట్టు కమిషన్ వ్యవస్థాపక చైర్మన్ ఎం.వి.ఎల్.నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషన్‌లోని విదేశీ, జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి కమిటీలు, ఎంవోయూలు రద్దు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ రద్దు వెంటనే అమల్లోకి వస్తుందని, అవగాహన సదస్సులు, సామాజిక సేవా కార్యక్రమాలు చేయక పోవడంతో కమిటీలను రద్దు చేస్తున్నట్టు వెల్లడించారు. భవిష్యత్‌లో సొసైటీకి, ప్రజలకు సేవలందించే విధంగా కొత్త కమిటీలు నియమిస్తామన్నారు.

వాల్తేర్ డివిజన్‌లో ముగిసిన హిందీ పక్షోత్సవాలు



హిందీ మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా, అధికారులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ పరిధిలో ప్రారంభమైన హిందీ పక్షోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా హిందీ వ్యాసరచన, నోట్, డ్రాఫ్టింగ్ పోటీలు, వక్తృత్వం, చిత్రం ఆధారిత ఆర్టికల్ రైటింగ్, షబ్దాక్షరి వంటి వివిధ పోటీలు నిర్వహించారు. హిందీ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆయా విభాగాల్లో హిందీ అధికారి, డివిజనల్ కమర్షియల్ మేనేజర్ పూజా సింగ్ నేతృత్వంలో నిర్వహించిన హిందీపై సెమినార్, ఇంటరాక్టివ్ శిక్షణ కార్యక్రమాల్లో రైల్వే సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని బహుమతులు, ప్రశంసాపత్రాలను గెలుచుకున్నారు. ముగింపు సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డీఆర్‌ఎం లలిత్ బోహ్రా మాట్లాడుతూ హిందీ భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వాల్తేర్ డివిజన్ ముద్రించిన ప్రత్యేక మ్యాగజైన్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), ఇ.శాంతారాం(ఇన్‌ఫ్రా), ఇతర అధికారులు పాల్గొన్నారు.

బైక్ దొంగ అరెస్ట్

తాటిచెట్లపాలెం: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా.. గణేష్‌నగర్‌లోని తమ ఇంటి ముందు పార్క్ చేసిన వాహనాలు దొంగతనానికి గురయ్యాయని ఇద్దరు వాహనదారులు ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 9న ఫిర్యాదు చేశారు. ఈమేరకు శుక్రవారం క్రైం ఎస్‌ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది విచారణ చేపట్టి, తనిఖీలు చేస్తున్న సమయంలో అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్‌లో వాహనాన్ని కనుగొని వ్యక్తిని ఆరా తీయగా.. పారిపోయేందుకు ప్రయత్నించడంతో అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు మధ్యప్రదేశ్ రాష్ట్ర వాసి అని, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి పనుల కోసం వచ్చిన వారితో, అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని ఫోర్త్‌టౌన్ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందిస్తున్న షేక్ రహిమాన్

తాటిచెట్లపాలెం: స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడం వల్ల ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్ల ఆదాయానికి గండి పడిందని, రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ రహిమాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.కాసుబాబులు శుక్రవారం ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో కార్మికులకు వచ్చే ఆదాయంలో 80 శాతం తగ్గిపోయిందని, ఇంటి అవసరాలు, అద్దెలు, ఈఎంఐలు, పిల్లల స్కూల్ ఫీజులు, విద్యుత్ చార్జీలు చెల్లించలేని దీనస్థితిలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన 21, 31 జీవోలతో వేలాది రూపాయలు అపరాధ రుసుములు, లేబర్, గ్రీన్ టాక్స్‌ల ద్వారా చార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. ఎటువంటి షరతులు లేకుండా డ్రైవర్లందరికీ వాహనమిత్ర వర్తింపజేయాలని, ప్రతి డ్రైవర్‌కు జీవనభృతి కింద నెలనెలా రూ.5 వేలు ఇవ్వాలని, ఇంధన చార్జీలపై 50 శాతం రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి ఆటో డ్రైవర్లకు న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు కార్మిక నాయకులు తెలిపారు. గంగరాజు, అప్పారావు, తాతారావు రెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

28న జర్నలిస్టుల దసరా సంబరాలు



మాట్లాడుతున్న గంట్ల శ్రీనుబాబు

సీతంపేట: ఈ నెల 28న దసరా సంబరాలు నిర్వహించనున్నట్టు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ అధ్యక్షుడు పి.నారాయణ తెలిపారు. అక్కయ్యపాలెంలోని ఒక హోటల్‌లో శుక్రవారం ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 28వ తేదీన ఉదయం 9 గంటల నుంచి అల్పాహారంతో దసరా సంబరాలు ప్రారంభమవుతాయన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, లక్కీడిప్, గేమ్స్ ఉంటాయన్నారు. జర్నలిస్టులకు మిఠాయిల పంపిణీతోపాటు మధ్యాహ్నం విందుభోజనం ఏర్పాటు చేస్తామని చెప్పారు. జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులతో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

టిడ్కో గృహాల్లో వసతులు కల్పించాలని ర్యాలీ



సీతమ్మధార అల్లూరి విగ్రహం నుంచి ర్యాలీగా వెళ్తున్న టిడ్కో గృహాల లబ్ధిదారులు

తాటిచెట్లపాలెం: దువ్వాడ ట్రి జంక్షన్, తలారివానిపాలెం ప్రాంతాల్లో నిర్మించిన టిడ్కో ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ లబ్ధిదారులు శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి ఉత్తర ఎమ్మెల్యే కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. టిడ్కో ఇళ్లకు కట్టాల్సిన ఈఎంఐల కంటే ఎక్కువగా చెల్లించాల్సి వస్తోందని, తమ గృహాలకు కనీసం మౌలిక వసతులు కూడా కల్పించలేదని వీరు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ రెండు ప్రాంతాల్లోని 4,800 గృహాలకు సంబంధించి రోజుకు 26 లక్షల లీటర్ల తాగునీరు అవసరం కాగా.. నీటి కొరత అధికంగా ఉందని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీరు, మౌలిక వసతుల విషయమై శాసనసభలో ప్రస్తావించానని, త్వరలోనే మళ్లీ మట్లాడి పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడ్కో గృహ లబ్ధిదారుల పోరాట నాయకుడు, సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారయణ, జిల్లా కార్యదర్శి ఎస్‌కే రెహమాన్, సహాయ కార్యదర్శి పి.చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.పైడిరాజు, ఎన్.నాగభూషణం, టిడ్కో గృహ లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యతోపాటు నైపుణ్యాలూ అవసరమే



ఫుడ్ ఫెస్టివల్‌లో ఆహార పదార్థాల రుచి చూస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

సీతంపేట: యువతకు విద్యతోపాటు ఉపాధి సాధనకు అవసరమైన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. అక్కయ్యపాలెం నరసింహనగర్ రైతుబజార్ వద్ద గల క్రూజ్ కాలనరీ అకాడమీ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, టూరిజం విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన యాంటీ డ్రగ్ అవేర్‌నెస్, రోడ్ సేఫ్టీ, ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమ్లాలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా కెరీర్‌పై దృష్టి సారించి ఉన్నతంగా రాణించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ విధిగా పాటించాలని సూచించారు. అనంతరం ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన ఆహార పదార్థాలను సీపీ తిలకించి రుచి చూశారు. స్టార్ హోటళ్ల తరహాలో అద్భుతంగా ఆహార పదార్థాలు తయారు చేశారని విద్యార్థులను అభినందించారు. అకాడమీ హెడ్ ఆదిబా రుహి సయ్యద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయడానికి రెండు నెలలకు ఒకసారి ఇటువంటి ఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ హెడ్ టికే ప్రభాకర్, టూరిజం అసిస్టెంట్ మేనేజర్ బసంత్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో విరిగిపడిన కొండచరియలు



ఇందిరానగర్ కొండవాలులో వర్షానికి జారుతున్న మట్టి, రాళ్లను చూపిస్తున్న స్థానికులు

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం ఇందిరానగర్–5 కొండవాలు ప్రాంతంలో తాజాగా కురుస్తున్న వర్షాలకు శుక్రవారం కొండచరియలు విరిగిపడిన సంఘటన జరిగింది. స్థానిక వ్యక్తి కర్రి దేములు ఇంటి మేడ మీద కొండపై నుంచి రాళ్లు, మట్టి పెళ్లలు జారిపడ్డాయి. ఈ ఘటనలో ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ గంకల కవిత, జోన్–5 అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొండవాలు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. కొండవాలులో రక్షణ గోడలు నిర్మించాలని జీవీఎంసీ మేయర్, కమిషనర్‌లకు వినతిపత్రాలు అందించినట్లు తెలిపారు. అధికారులు స్పందించకుంటే పెను ప్రమాదాలు జరిగే అవకాశముందన్నారు.

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 23 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీసీపీ ప్రభాకరరావు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 23 వినతులు వచ్చాయని చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు తెలిపారు. సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. జోన్–1 నుంచి ఒకటి, జోన్–2 నుంచి రెండు, జోన్–3 నుంచి మూడు, జోన్–4 నుంచి రెండు, జోన్–5 నుంచి ఐదు, జోన్–6 నుంచి ఒకటి, జోన్–8 నుంచి తొమ్మిది వినతులు అందాయన్నారు. నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని సీసీపీ ఆదేశించారు.

కిమ్స్‌లో గ్యాస్ట్రో ఎంటరాలజీ క్లినిక్‌ల ప్రారంభం

తాటిచెట్లపాలెం: సీతమ్మధారలోని కిమ్స్ హాస్పిటల్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్యాస్ట్రో ఎంటరాలజీ స్పెషాలిటీ క్లినిక్‌లను శుక్రవారం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరంలోని ఉదర భాగంలో వచ్చే సమస్యలను వీలైనంత త్వరగా, కచ్చితంగా గుర్తించడం చాలా ముఖ్యమన్నారు. ఇటువంటి వ్యాధులకు కిమ్స్ హాస్పిటల్‌లో అడ్వాన్స్‌డ్ ఎండోస్కోపి, కొలనోస్కోపి, ఈఆర్‌సీపీ, నారోబ్యాండ్ ఇమేజింగ్, ఎండోస్కొపిక్ అల్ట్రా సౌండ్, ఫైబ్రోస్కాన్, కొలాంజియోస్కోపి లాంటి అత్యాధునిక సదుపాయాలు సమకూర్చామని తెలిపారు. వీటితో ఉదర భాగంలో ఎలాంటి సమస్యనైనా త్వరగా గుర్తించి చికిత్స అందించే అవకాశముంటుందన్నారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాధిపతి, చీఫ్ కన్సల్టెంట్, గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ ఆచంట చలపతిరావు మాట్లాడుతూ గ్యాస్ట్రో సమస్యల చికిత్స కోసం సీతమ్మధార కిమ్స్ హాస్పిటల్‌లో ప్రత్యేకంగా ఫ్యాటీ లివర్, పాంక్రియాస్ క్లినిక్, ఐబిడి క్లినిక్, క్యాన్సర్ క్లినిక్‌లను ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కసిరెడ్డి తిరుపతిరావు, డాక్టర్ తాటి శ్రీనివాసరావు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శ్రీధర్ తదితరలు పాల్గొన్నారు.

ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీ బయోటిక్స్ విక్రయం నేరం

మహారాణిపేట: ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీ బయోటిక్స్ విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డ్రగ్ కంట్రోల్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. విజయకుమార్ హెచ్చరించారు. శుక్రవారం సిరిపురంలోని చిల్డ్రన్స్ ఎరీనాలో జిల్లా డ్రగ్ అసోసియేషన్, స్మార్ట్ విశాఖ కెమిస్ట్ వెల్ఫేర్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కెమిస్టులు, డ్రగ్గిస్టులు నిరంతర పర్యవేక్షణలో ఉన్నారని, అక్రమాలకు పాల్పడే వారిపై తరచుగా తనిఖీలు నిర్వహిస్తూ కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. గీతం యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్. స్వర్ణలత యాంటీబయోటిక్స్ వినియోగం, వాటి దుష్ప్రభావాలపై ప్రసంగించారు. డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీనివాస్ రావు ఆన్‌లైన్ నేషనల్ డ్రగ్స్ లైసెన్సింగ్ సిస్టమ్‌కు సంబంధించిన సాంకేతిక అంశాలపై వివరణ ఇచ్చారు. సేల్స్ లైసెన్సింగ్ సిస్టమ్‌లో దరఖాస్తులు, అనుమతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు వి.అభిప్రియ, కున కల్యాణి, ఇందిరా భారతి, ఎన్.కల్యాణి, సుమారు 650 మంది ఫార్మసిస్టులు, కెమిస్టులు పాల్గొన్నారు.

‘సెయింట్ జోసెఫ్’లో జాతీయ ప్రోగ్రామర్స్ డే



విజేతలతో అధ్యాపకులు, అతిథులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ ప్రోగ్రామర్స్ డేను పురస్కరించుకుని అంతర్ కళాశాలల ఫెస్ట్ ‘డేవ్ కాన్’ ఘనంగా నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ హేమ, కంప్యూటర్ సైన్స్ విభాగాధ్యక్షులు కె.నాగశిరీష, పి.కె.జయలక్ష్మి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫెస్ట్‌లో భాగంగా టెక్ మీమ్, కోడింగ్ చాలెంజ్, డీబగ్గింగ్ క్వెస్ట్, ట్రెజర్ హంట్, ఐడియాథాన్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రిజమ్, ఏవీఎన్, కృష్ణా కళాశాలల విద్యార్థినులు పాల్గొని విజయవంతం చేశారు. కార్యక్రమంలో జి.దీప్తి, ఎస్.మాధురి, జె.అనిత రాణి, కుంకుం ధారా, కె.ఎస్టేర్‌లిల్లీ, కృష్ణ ప్రసాద్ సాహు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై కొనసాగుతున్న పోరు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న జిల్లా కార్యదర్శి పెద్దినాయుడు, నాయకులు

మురళీనగర్: ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ విశాఖ జిల్లా శాఖ నిర్వహిస్తున్న పోరు బాట శుక్రవారం కొనసాగింది. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.పెద్దినాయుడు ఆధ్వర్యంలో మురళీనగర్, మాధవధార, ఏఎస్సార్ నగర్, బర్మా కాలనీ ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. మొదటి రోజు గురువారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరైన ఉపాధ్యాయులు, రెండో రోజు శుక్రవారం నిరసన తెలుపుతూ మండల తహసీల్దార్ రమేష్‌కు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గోపాలపట్నం అర్బన్ మండలం అధ్యక్షుడు కురచా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి వానపల్లి నరేష్, గోపాలపట్నం రూరల్ మండలం అధ్యక్షురాలు గుల్లిపల్లి శైలజ, ప్రధాన కార్యదర్శి కొటాన కోటేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్ పూర్ణచంద్రరావు, తోటకూర శ్రీధర్, బండారు వాసు, హరి హరనాథ్, సత్యవతి, భవాని పాల్గొన్నారు.